సాక్షి రంగారెడ్డి

సోమవారం । 5 । ఆగస్టు । 2024



పరిమిత సాగుతో..

పంట బాగా వస్తుందనే అపోహలో రైతులు క్షేత్రస్థాయిలో పోటీపడి పురుగు మందులు వాడుతున్నారు.

8లో▸



క్రీడలతో మానసికోల్లాసం

క్రీడలు మానసిక ఉల్లాసం కలుగుతుందని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు.

8లో▸



త్రుటిలో తప్పిన ప్రమాదం

రాత్రి సమయంలో అతివేగంతో వచ్చిన ఓ కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని రోడ్డు కిందికి దూసుకుపోయింది.

8లో▸

న్యూస్‌రీల్

వయనాడ్ బాధితులను ఆదుకుందాం

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీను చౌహాన్



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ప్రకృతి విలయానికి కేరళలోని వయనాడ్ ప్రాంతం పూర్తిగా అతలాకుతలమయిందని వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతీ ఒక్కరు తమ సాయం అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీను చౌహాన్ కోరారు. వయనాడ్ వరద బాధితులను సహాయార్థం సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా శ్రీను చౌహాన్ మాట్లాడుతూ.. భారీ వర్షాలకు వయనాడ్ ప్రాంతం నీట మునిగిందని, ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది మంది ప్రజలు నిరాశ్రయులుగా మిగిలారన్నారు. వారిని ఆదుకునేందుకు ప్రతీ ఒక్కరు సాయం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్, ఆకాశ్, సాయి, లింగం నాయక్, చంద్రబాబు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

టీజీఓ జిల్లా కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన టీజీఓ జిల్లా కమిటీ సభ్యులు

తుక్కుగూడ: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీఓ) రంగారెడ్డి జిల్లా కమిటీని ఆదివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు కె.రామారావు, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా ఎస్.వెంకటేశ్వర్లు, ఎం.అలివేలుమంగ, సెక్రటరీగా శ్రీనేశ్‌కుమార్, జాయింట్ సెక్రెటరీగా అనిత, లక్ష్మణ స్వామి, ట్రెజరర్‌గా ఎస్.శ్రీనివాసులు, మహిళా విభాగం ప్రెసిడెంట్‌గా రేవతి దేదీప్య, జాయింట్ సెక్రటరీగా మహేశ్వరి కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల నిర్వహణ అధికారులు ఆర్ శ్రీనివాసమూర్తి, శ్రీనివాసులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీనివాసరావు, సత్యనారాయణ శ్యాం, ఉపేందర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రావు, పరమేశ్వర్‌రెడ్డి, దీపారెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని స్నేహ బంధం

- ఫ్లై ఓవర్‌పై అదుపు తప్పిన బైక్
- ఇద్దరు యువకుల దుర్మరణం



రోహిత్ (ఫైల్)



బాల ప్రసన్న (ఫైల్)

రాయదుర్గం: స్నేహితుల దినోత్సవం రోజు తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు దుర్మరణం పాలయ్యారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం .. ఏపీలోని గుంటూరు జిల్లా రొంపిచర్ల మండలం విప్పర్ల గ్రామానికి చెందిన నాగేశ్వరరావు కుమారుడు వి.బాల ప్రసన్న (24) ఉన్నత చదువుల కోసం నగరానికి వచ్చాడు. ఇదే జిల్లా మర్రిచెట్టుపాలేనికి చెందిన తన స్నేహితుడు కె.రోహిత్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌తో కలిసి బాల ప్రసన్న మియాపూర్‌లోని హఫీజ్‌పేట్‌లో నివాసముంటున్నాడు. ఆదివారం వేకువజామున బైక్‌పై వెళ్తున్నారు. రోహిత్ వాహనం నడిపిస్తుండగా ప్రసన్న వెనక సీటులో కూర్చున్నాడు. మసీదుబండ నుంచి హఫీజ్‌పేట్ మార్గంమధ్యలో కొత్తగూడ జంక్షన్ ఫ్లైఓవర్ మూల మలుపు వద్ద వీరి బైక్ అదుపు తప్పి ఫ్లై ఓవర్ గోడను ఢీకొనడంతో కింద రోడ్డుపై పడిపోయారు. ఇద్దరి తలలకు, ఇతర భాగాలకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ప్రసన్నను కొండాపూర్ ఏరియా ఆస్పత్రికి, రోహిత్‌ను మాదాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో రోహిత్ మృతిచెందాడు. బాల ప్రసన్న 5.18 గంటలకు చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. 48 నిమిషాల వ్యవధిలో ఇద్దరు స్నేహితులూ మృతి చెందడంతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గచ్చిబౌలి పోలీసులు పేర్కొన్నారు.

అక్కడ గలగల.. ఇక్కడ వెలవెల!

జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం

- జంట జలాశయాలకు చేరని చుక్క నీరు
- సరూర్‌నగర్‌లో వేగంగా పడిపోతున్న భూగర్భ జలమట్టం



వెలవెలబోతున్న ఈసీ వాగు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కృష్ణాగోదావరి నదులు వరదలతో ఉప్పొంగుతుంటే జిల్లాలోని జంటజలాశయాలకు మాత్రం చుక్కనీరు చేరడం లేదు. గతంతో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడమే ఇందుకు కారణం. ఫలితంగా హిమాయత్‌సాగర్ ఎగువన ఉన్న ఈసీ వాగు సహా ఉస్మాన్‌సాగర్ ఎగువన ఉన్న మూసీ వాగులు చుక్కనీరు లేక వెలవెలపోతున్నాయి. దీంతో నగరానికి తాగునీరు అందించే కీలకమైన ఈ జంట జలాశయాల్లో నీటిమట్టం క్రమంగా పడిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. 2.56 టీఎంసీల సామర్థ్యం ఉన్న హిమాయత్‌సాగర్‌లో ప్రస్తుతం 1,755.45 అడుగుల ఎత్తులో(సుమారు 1.95 టీఎంసీల నీరు నిల్వ ఉండగా), 2.96 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఉస్మాన్‌సాగర్‌లో 1,778.95 అడుగుల ఎత్తులో (సుమారు 2 టీఎంసీల) నీరు నిల్వ ఉంది. ఈ రెండు జలాశయాల నుంచి పాతబస్తీకి రోజుకు సగటున 15 ఎంజీడీ వాటర్ నగరానికి సరఫరా అవుతుండటం, ఎగువ నుంచి చుక్కనీరు కూడా వచ్చి చేరకపోవడంతో వీటిలోని నీటినిల్వ సామర్థ్యం క్రమంగా తగ్గిపోతోంది.

సాధారణం కంటే తక్కువ వర్షపాతం

జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే ఈ సారి సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది జులైలో సాధారణంగా 242.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 240.06మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే కురిసింది. శంకర్‌పల్లి, నందిగామ, తలకొండపల్లి, కేశంపేట, ఆమనగల్‌లో సాధారణం కంటే కొంత ఎక్కువ వర్షపాతం నమోదు కాగా, మెయినాబాద్, మంచాల, మహేశ్వరం, శేరిలింగంపల్లి, చౌదరిగూడెం, కొందుర్గు, మాడ్గుల, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, చేవెళ్ల, సరూర్‌నగర్, ఇబ్రహీంపట్నం, యాచారం, బాలాపూర్ మండలాల్లో మోస్తారు వర్షపాతం నమోదైంది. కందుకూరు, రాజేంద్రనగర్, గండిపేట, ఫరూఖ్‌నగర్, శంషాబాద్‌లలో అత్యల్ప వర్షపాతం నమోదైంది. దీంతో పంటల సాగు కూడా ఘననీయంగా తగ్గింది. ఆయా మండలాల్లోని కీలకమైన చెరువులు, కుంటలు నీరు లేక వెలవెలపోతుండటంతో, వ్యవసాయ బోర్లు కూడా వట్టి పోవడంతో వాటి కింద వరి సహా ఇతర పంటల సాగు తగ్గిపోయింది. సాధారణంగా ఒక్కో బోరు బావి కింద ఎకరం నుంచి రెండు ఎకరాల వరకు వరిసాగు చేసిన రైతులు.. ఈ సారి రెండు మూడు మడులకే పరిమితం అయ్యారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



హిమాయత్‌సాగర్‌లో తగ్గిన జలాలు

పాతాళంలో గంగమ్మ

ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం, భూగర్భ జలమట్టం పాతాళానికి పడిపోయింది. గత ఏడాది 8.96 మీటర్ల లోతులో కన్పించిన నీటి ఆనవాళ్లు.. ప్రస్తుతం 13.08 మీటర్ల లోతుకు వెళ్లినా కన్పించకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. సరూర్‌నగర్‌లో గత ఏడాది 8.26 మీటర్ల లోతులో కన్పించిన నీటి ఆనవాళ్లు..ఈ సారి ఏకంగా 20.51 మీటర్ల లోతుకు పడిపోయాయి. శేరిలింగంపల్లిలో గత జులైలో 11.12 మీటర్ల లోతులో కన్పించిన నీటి ఆనవాళ్లు.. ఈ జులైలో 17.81 మీటర్ల లోతుకు పడిపోయాయి. అదే విధంగా ఇబ్రహీంపట్నంలో 12.52మీటర్ల నుంచి 17.53 మీటర్ల లోతుకు, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 5.65 మీటర్ల లోతు నుంచి 9.95 మీటర్ల లోతుకు, కొత్తూరులో 8.87 మీటర్ల నుంచి 13.89 మీటర్ల లోతుకు, మహేశ్వరంలో 9 మీటర్ల నుంచి 13.89 మీటర్లలోతుకు, యాచారంలో 6.41 మీటర్ల నుంచి 10.49 మీటర్ల లోతుకు, తలకొండపల్లిలో 12.28 మీటర్ల నుంచి 18.85 మీటర్ల లోతుకు పడిపోయింది. బాలాపూర్‌లో 7.2 మీటర్ల లోతు నుంచి 10 మీటర్ల లోతుకు పడిపోయింది. ముఖ్యంగా నిర్మాణాలు ఎక్కువగా జరిగే ఫ్యూజో మీటర్ల పరిధిలోని మండలాల్లోనే భూగర్భ జలమట్టం వేగంగా పడిపోతుండటంపై సర్వత్రా ఆందోళన నెలకొంది.



పహాడీషరీఫ్: జల్‌పల్లిలో బోనాల ఊరేగింపు

బోనం.. ఘనం

ఆషాఢ మాస చివరి ఆదివారం బోనాలు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తజన సందోహం నడుమ బోనాలు ఊరేగింపుతో గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లు, శివసత్తుల శిగాలు, పోతరాజుల ఆటలు ఆకట్టుకున్నాయి. డీజే చప్పుళ్లకు యువత నృత్యాలు చేశారు.

– ఇబ్రహీంపట్నం రూరల్, పహాడీషరీఫ్



ఇబ్రహీంపట్నం రూరల్: అమ్మవారి బోనంతో ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ దంపతులు

కాసువాగు భూములను విడిపించండి

- డిప్యూటీ సీఎంకు కుర్మల్‌గూడ రైతుల మొర
- విచారణ చేయించి, న్యాయం చేస్తామని భట్టి హామీ



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను చుట్టుముట్టిన భూ బాధితులు

బడంగ్‌పేట్: కబ్జాదారుల చెరనుంచి మా భూములకు విముక్తి కల్పించి తమను ఆదుకోవాలని పలువురు రైతులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు విన్నవించారు. ఆదివారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కుర్మల్‌గూడలో నిర్వహించిన బంగారు మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలకు డిప్యూటీ సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాదర్‌గుల్‌లోని కాసువాగు భూబాధితులు భట్టిని కలిసి వినతి పత్రం సమర్పించారు. సర్వే నంబర్ 613లో కాసువాగు వెంటనున్న 373 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు అక్రమార్కులు ఆక్రమించుకున్నారని.. ఆ భూముల చుట్టూ ప్రహరీ నిర్మించి రైతులను అడుగు పెట్టనీయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాదారుల చెర నుంచి తమ భూములను విడిపించి న్యాయం చేయాలని బాధితులు విన్నవించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రైతులకు జరిగిన అన్యాయంపై ఉన్నతాధికారులతో విచారణ జరిపించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. భట్టి వెంట డీసీసీ అధ్యక్షుడు, అర్బన్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాతనర్సిహారెడ్డి, పలురువు కార్పొరేటర్లు , కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల కిడ్నాపర్ అరెస్ట్

- కొత్తూరు, అబిడ్స్ పీఎస్‌లలో ఫొక్సో, కిడ్నాప్ కేసు
- నిందితుడిది గతంలోనూ నేర చరిత్రే..

కొత్తూరు: ఇంటి ఎదుట స్నేహితులతో ఆడుకుంటున్న బాలికలే వాడి టార్గెట్. చాక్లెట్ ఆశ చూపి చిన్నారులను క్షణాల్లో కిడ్నాప్ చేసే ఘరానా నిందితుడిని హైదరాబాద్, కొత్తూరు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి కటకటాల పాలు చేశారు. కొత్తూరు సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని అబిడ్స్ ఠాణా పరిధిలో ఈ నెల 3న ఆరేళ్ల చిన్నారిని గుర్తు తెలియని దుండగుడు కిడ్నాప్ చేసినట్టు సమాచారం అందింది. అబిడ్స్ పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడు కిడ్నాప్ చేసిన చిన్నారిని తీసుకుని మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ బస్టాండ్‌లో దిగినట్టు గుర్తించారు. జూలై 18న కొత్తూరు పట్టణంలో ఎనిమిదేళ్ల చిన్నారిని కిడ్నాప్ చేసిన వ్యక్తి, అబిడ్స్‌లో చిన్నారిని కిడ్నాప్ చేసిన నిందితుడు ఒకడేనని నిర్ధారించుకున్నారు. హైదరాబాద్, కొత్తూరు పోలీసుల బృందాలు ఇన్ముల్‌నర్వ పరిధిలో తెల్లవార్లు గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం అబిడ్స్‌లో కిడ్నాప్ చేసిన బాలికతో కలిసి ఇన్ముల్‌నర్వ బస్టాండ్ వద్ద ఉండగా గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో హైదరాబాద్ పోలీసులు, చిన్నారి కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించారు.

బిహార్ నుంచి వచ్చి..

కొత్తూరు, అబిడ్స్ పోలీస్ స్టేషన్ల పరిధిలో చిన్నారులను కిడ్నాప్ చేసిన మహ్మద్ బిలాల్ అన్సారీ(35)కి సొంత రాష్ట్రమైన బిహార్‌లోనూ ఇదే నేర చరిత్ర ఉందని కొత్తూరు సీఐ నర్సింహారావు వెల్లడించారు. కొత్తూరు చిన్నారి కిడ్నాప్ కేసులో భాగంగా పోలీసులు బిహార్ వెళ్లి నిందితుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నిందితుడు జూలై 4న నందిగామ మండలంలోని మేకగూడలో ఓ పరిశ్రమ నిర్మాణ పనుల్లో కూలీగా వచ్చాడు. నాలుగు రోజులు పనిచేసి మానేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. జూలై 18న కొత్తూరు పట్టణంలో ఎనిమిదేళ్ల చిన్నారిని కిడ్నాప్ చేసి తప్పించుకున్నాడు. అనంతరం ఈ నెల 3న అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరేళ్ల చిన్నారిని కిడ్నాప్ చేసి ఇన్ముల్‌నర్వకు వచ్చిన నిందితుడు ఇన్ముల్‌నర్వ-మేకగూడ గ్రామాల శివార్లలో ఉన్న ఓ భవనంలో చిన్నారిని ఉంచాడు. ఆదివారం నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కొత్తూరు, అబిడ్స్ స్టేషన్ల పరిధిలో ఫొక్సో, కిడ్నాప్ కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఛేదించింది ఇలా ..

జూలై 18న కొత్తూరు పట్టణంలో ఎనిమిదేళ్ల చిన్నారిని కిడ్నాప్ చేసిన నిందితుడు మరుసటి రోజు ఉదయం నందిగామ మండలంలోని రంగాపూర్ శివారులో దర్గా-కొత్తూరు రోడ్డుపై వదిలేశాడు. పాపను గుర్తించిన ఓ పాల ఆటో వ్యక్తి ఆమెను కొత్తూరులో దించగా ఇంటికి చేరుకుంది. ఈ నెల 3న అబిడ్స్‌లో కిడ్నాప్ చేసిన చిన్నారిని నిందితుడు అబిడ్స్ నుండి అఫ్జల్‌గంజ్ వరకు ఆటోలో తీసుకొచ్చాడు. అక్కడి నుండి జేపీదర్గాకు వెళ్లే బస్సులో ఎక్కి ఇన్ముల్‌నర్వ బస్టాండ్‌లో దిగాడు. అప్పటికే నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులకు స్థానికులు ఆదివారం తెల్లవారుజామున సమాచారం ఇవ్వడంతో అరెస్ట్ చేశారు.

దైవ ప్రార్థనకు వెళ్తూ.. అనంత లోకాలకు

- ఓవర్‌టేక్ చేయబోయి బస్సును ఢీకొట్టిన స్కూటీ
- తల్లీకుమారుల దుర్మరణం
- మరో కొడుకు పరిస్థితి విషమం



ప్రమాద వివరాలు సేకరిస్తున్న ఎస్సై గోపాలకృష్ణ



బస్సు కిందకు దూసుకెళ్లిన స్కూటీ

నందిగామ: దైవ ప్రార్థనకు వెళ్తున్న తల్లీకుమారులను ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. ఇద్దరు కొడుకులతో కలిసి స్కూటీపై వెళ్తున్న మహిళ ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయపోయి రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో తల్లి, పెద్ద కుమారుడు మృతి చెందగా చిన్న కొడుకు ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ విషాదకర సంఘటన మండల పరిధిలోని రంగాపూర్ సమీపంలోని జహంగీర్ పీర్ దర్గా రోడ్డు మలుపు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్ట సమీపంలోని ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన హజరత్ బేగం(35) తన ఇద్దరు కుమారులు అబ్దుల్ రహమాన్(12), రహీం(9)లతో కలిసి స్కూటీపై జేపీ దర్గాకు బయలుదేరారు. మార్గమధ్యలో రంగాపూర్ సమీపంలోని మలుపు వద్ద ముందు వెళ్తున్న ఓ వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై ఉన్న హజరత్ బేగం తన ఇద్దరు కుమారులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను వెంటనే శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ హజరత్ బేగం, అబ్దుల్ రహమాన్ మృతి చెందగా, రహీం పరిస్థితి విషమంగా ఉంది. కాగా మృతురాలి భర్త విదేశాల్లో ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

మారే అవకాశం ఎక్కువ

దర్శకుడు వంశీ

బంజారాహిల్స్: నవలతోనే తన సాహిత్య ప్రస్థానం మొదలైందని.. ఒక మంచి నవల సినిమాగా మారే అవకాశం ఎక్కువగా ఉంటుందని ప్రముఖ దర్శకుడు వంశీ అన్నారు. ఆన్వీక్షికి-చదువు సంయుక్తంగా నిర్వహించిన 2023- ఉగాది నవలల పోటీ బహుమతి ప్రదానోత్సవం ఆదివారం బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా వంశీ విచ్చేసి బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. గతంలో ఇలాంటి ప్రయత్నాలు చాలా జరిగాయని, సినిమా, సాహిత్యం వేర్వేరు దారుల్లో ప్రయాణిస్తున్న ఈ సమయంలో ఆన్వీక్షికి ద్వారా చేపట్టిన ఈ ప్రయత్నం అందరికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సినీనటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ.. తెలుగులో పుస్తకాలు కొనేవాళ్లు పూర్తిగా లేరని, అనుకునే పరిస్థితి నుంచి ఒక పుస్తకం వేస్తే నెల రోజుల్లోనే వెయ్యి కాపీలు అమ్ముడవడంతో పాటు ఇంత పెద్ద ఎత్తున అవార్డు కార్యక్రమం నిర్వహించడం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు.

ఉస్మానయా!

- గోషామహల్ మైదానంలో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం
- ఈ నెల 15న శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు

సాక్షి, సిటీబ్యూరో: ఎంతోమంది పేద రోగుల కల నిజం కానుంది. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న ఆ తరుణం రానే వచ్చింది. ఇన్నాళ్లు కోర్టు కేసులతో కొనసాగుతూ వచ్చిన ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో అందరి కళ్లల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. గోషామహల్ పోలీసు మైదానంలో కొత్త ఉస్మానియా ఆస్పత్రిని నిర్మించేందుకు ప్రభుత్వం 30 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఈ నెల 15న ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

750– 1000 పడకలతో..

బహుళ అంతస్తుల్లో ఆస్పత్రిని నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. కొత్త ఆస్పత్రిలో 750 నుంచి వేయి పడకల వరకు ఉండే అవకాశాలు ఉన్నాయి. ఓపీ విభాగంతో పాటు ఇన్‌పేషెంట్లకు అవసరమైన వార్డులు, పడకలు, ఆధునిక పరికరాలు ఏర్పాటు చేయనున్నారు. ఆపరేషన్ థియేటర్లు నిర్మించనున్నారు. సీసీటీవీల నిఘా, అగ్ని ప్రమాదాల నుంచి రక్షణకు అనుగుణంగా ఈ భవనాన్ని నిర్మించాలని యోచిస్తున్నారు.

నీటిపై రాతలే..

2014లో అప్పటి సీఎం కేసీఆర్ ఉస్మానియా ఆస్పత్రిని సందర్శించారు. వారం రోజుల్లో పాత భవనాన్ని ఖాళీ చేసి దాని స్థానంలో కొత్త భవనం నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఆమేరకు తెలంగాణ తొలి బడ్జెట్లో రూ.200 కోట్లు కేటాయించారు. తాత్కాలికంగా పేట్లబురుజు ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రులకు పలు వార్డులను తరలించాలని నిర్ణయించి, ఆ మేరకు ఆయా ఆస్పత్రుల్లో పడకలు కూడా సిద్ధం చేశారు. అక్కడికి వెళ్లేందుకు వైద్యులు నిరాకరించడంతో రోగుల తరలింపు నిలిచిపోయింది. ఇదే ఆస్పత్రి ప్రాంగణంలో ఖాళీగా ఉన్న స్థలంలో మరో రెండు బహుళ అంతస్తుల భవనాలు నిర్మించనున్నట్లు ఆయన ప్రకటించినా, అడుగు కూడా ముందుకు పడలేదు.

ఇక్కడికి రవాణా సాధ్యమేనా..?

గోషామహల్ పోలీస్ మైదానంలో నిర్మించాలని ప్రతిపాదనలు చేస్తున్న తరుణంలో ఇక్కడ పరిస్థితులు రోగుల సేవలకు అనుకూలంగా ఉంటాయా? అనే విషయంలో కొందరు పెదవి విరుస్తున్నారు. ఈ ప్రాంతానికి చేరుకునేందుకు రోగులకు రవాణా సౌకర్యాలు అంతగా లేవని చెబుతున్నారు. బేగంబజార్ ప్రాంతంలో తీవ్రమైన ట్రాఫిక్ ఉంటుంది. ఎమర్జెన్సీ కోసం వచ్చే రోగులు అక్కడికి ఎలా చేరుకుంటారనే దానిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పాత భవనానికి ఘన చరిత్ర..

ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ హయాంలో (1918–25) ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం జరిగింది. సుమారు 27 ఎకరాల విస్తీర్ణంలో అలనాటి ప్రముఖ ఆర్కిటెక్ట్ విన్సెంట్ మార్గదర్శకత్వంలో ఈ మహాధం వెలిసింది. అప్పటి నుంచి ఇక్కడ తెలంగాణలోని అన్ని జిల్లాల ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందుతూ వస్తున్నాయి. కాలక్రమేణా ఈ ఆస్పత్రిపై ప్రభుత్వాల శీతకన్నుతో నిర్వహణ లోపాల కారణంగా శిథిలమవుతూ వస్తోంది.

పరిమితి సాగుతోనే లాభాలు

పత్తి పంటలో అధిక దిగుబడులు రావాలంటే సరైన సమయంలో పరిమిత స్థాయిలో క్రిమి సంహారక మందులు, కృత్రిమ ఎరువులు వాడాలి. అవగాహనా లేమితో అధిక మోతాదులో వాడితే దిగుబడులు అటుంచితే పెట్టుబడులు సైతం రాని పరిస్థితి ఉంటుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

- పత్తిలో మోతాదులోనే పురుగు మందు వాడాలి
- షాబాద్ మండల వ్యవసాయాధికారి వెంకటేశం



తాళ్లపల్లిలో సాగు చేసిన పత్తి పంట



షాబాద్: పంట బాగా వస్తుందనే అపోహలో రైతులు క్షేత్ర స్థాయిలో పోటీపడి పురుగు మందులు వాడుతున్నారు. పత్తిపంట చేతికొచ్చేలోపు నాలుగు సార్లు మాత్రమే పురుగు మందులు పిచికారీ చేయాలి. ఎక్కువ మోతాదులో వాడితే లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉంటాయని షాబాద్ మండల వ్యవసాయాధికారి వెంకటేశం హెచ్చరిస్తున్నారు. అవగాహన లోపంతో రైతులు ఎక్కువ మోతాదులో పురుగు మందులు వాడి నష్టాలు బారిన పడుతున్నారు.

ఇరవై ఎకరాల్లో సాగు

మండలంలో సాగవుతున్న ప్రధాన పంటల్లో పత్తి ఒకటి. దాదాపు 20 వేల ఎకరాల్లో పంటను సాగు చేస్తున్నారు. చాలా మంది రైతుల్లో పంటల సాగు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన ఉండటం లేదు. దీంతో పత్తి పంటకు పురుగు మందు వాడే విషయంలో రైతులకు అవగాహన లేక ఎక్కువ మోతాదులో మందులు వాడుతున్నారు. ప్రస్తుతం పత్తి విత్తనాలు రెండు నెలలు కావొస్తున్నందున గూడలు వచ్చే దశలో పంట ఉంది. రైతులు ప్రస్తుతం విత్తుతున్న పత్తి విత్తనాలు విత్తిన 90 రోజులలోపు కాన్ఫిడార్ లాంటి మందును ఆకులకు ముడతలు రాకుండా ఒకటి, రెండు సార్లు వాడితే సరిపోతుంది. కానీ ఇప్పటికే రైతులు తమకు తోచిన మందులు రెండు సార్లు పిచికారీ చేశారు. మరోవైపు నీటిలో కలపాల్సిన మందు మోతాదు సైతం ఎక్కువగా ఉంటోంది.

అధిక మోతాదుతో అనర్థాలు

ఎక్కువసార్లు పురుగు మందు పిచికారీ చేయడం, అధికం మోతాదులో మందులు వాడటం వల్ల పంటకు మంచి కంటే కీడే ఎక్కువగా జరుగుతుంది. అధిక మోతాదు మందులతో ఆకులు ముడత పడటంతో పాటు పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. దీనికి తోడు భూమిలో సారం సైతం జీవం కోల్పోతోంది. వీటికి అధికంగా ఖర్చు వెచ్చించాల్సి ఉంటుంది.

సరైన సమయంలో యూరియా

వర్షాలు కురువడం మానేసి 15 రోజులు దాటితే యూరియా నీటిలో కలిపి పత్తి పంటపై స్ప్రే చేయడం ద్వారా మంచి ఫలితం ఉంటుంది. లీటర్ నీటికి 10 నుంచి 15 గ్రాముల యూరియాను నీటిలో కరిగించి స్ప్రే చేయాలి. ఇలా చేయడంతో వర్షాభావ పరిస్థితులు కొంత వరకైన పంట తట్టుకుంటుంది. పంటపై పచ్చదోమ ఎక్కువగా ఉంటే ఆస్ఫేట్ మందులు వాడాలి.

వర్షం కురిస్తేనే..

వర్షాలు కురిస్తేనే ఎక్కువగా ఎరువులు వేయాలి. వేసే ఎరువులు సైతం మొక్క పక్కన నేలపై కాకుండా మట్టి తీసి నేల లోపల వేయాలి. తిరిగి మట్టితో కప్పితే మంచి పంటకు పోషకాలు అధికంగా అందుతాయి.

దుష్పరిణామాలు

పురుగు మందులు అధికంగా వాడటం ద్వారా పంటపై దుష్పరిణామాలే ఎక్కువగా ఉంటాయి. కొన్ని చోట్ల రైతులు పత్తికి ఇప్పటికే రెండు నుంచి మూడు సార్లు మందులు పిచికారీ చేశారు. అధిక మోతాదులో కృత్రిమ ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడితే పంటకు నష్టం జరుగుతుంది. పురుగులు సైతం చనిపోయే అవకాశం ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు మందులు వాడాలి.

ట్రాన్స్‌కో కార్మికుడి మృతిపై కేసు

కేశంపేట: విద్యుదాఘాతంతో ట్రాన్స్‌కో కార్మికుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. కేశంపేట ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ మోటార్లకు విద్యుత్ రావడం లేదని రైతుల ఫిర్యాదు మేరకు ఆర్టిజన్‌గా విధులు నిర్వహిస్తున్న బాలాచారి(35) శనివారం సాయంత్రం వెళ్లారు. జంపర్‌లో ప్రాబ్లంను గుర్తించి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి బాలాచారి మృతి చెందాడు. మృతుడి మామ మధుసూధనాచారి ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రాణం తీసిన వేగం

అతివేగంగా బైక్‌ను నడపడంతో ఎగిరిపడి వెనుక కూర్చున్న యువకుడి దుర్మరణం



శంకర్ (ఫైల్)

మాదాపూర్: ఓ యువకుడు బైక్‌ను అతివేగంగా నడపడంతో వెనక కూర్చున్న మరో యువకుడు ఎగిరిపడి మృతి చెందిన సంఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అమలాపురం ప్రాంతానికి చెందిన ప్రవీణ్(25), అరిగాలి జైస్వామి శంకర్(24) సికింద్రాబాద్‌లోని పారడైజ్ ఐసీఐసీఐ బ్యాంక్‌లో ఇన్సూరెన్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ కేపీహెచ్‌బి రోడ్ నెంబర్ 6లో నివాసముంటున్నారు. ఆదివారం తెల్లవారు జామున వారు ఇద్దరూ స్నేహితులను కలిసేందుకు బైక్‌పై బయలుదేరారు. ప్రవీణ్ బైక్ నడుపుతుండగా జైస్వామి శంకర్ వెనక కూర్చున్నాడు. జేఎన్‌టీయూ నుంచి మాదాపూర్ వైపు వెళుతుండగా అతివేగం కారణంగా మాదాపూర్‌లోని ఎన్ఐఏ ఫ్లైఓవర్ వద్ద బైక్ అదుపుతప్పడంతో ప్రవీణ్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనక కూర్చున్న జైస్వామి శంకర్ ఎగిరి కిందపడ్డాడు. అదే సమయంలో అటుగా వెళుతున్న లారీ చక్రాలు అతడి మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రవీణ్ గాయాలతో బయటపడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

అతివేగంతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు



కిందపడిన విద్యుత్ స్తంభం

మొయినాబాద్: రాత్రి సమయంలో అతివేగంతో వచ్చిన ఓ కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని రోడ్డు కిందికి దూసుకుపోయింది. ఈ సంఘటన శనివారం అర్ధరాత్రి మండల పరిధిలోని అమ్డాపూర్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని గచ్చిబౌలిలో ఉండే ఓ షోరూంలో పనిచేసే ముగ్గురు శనివారం రాత్రి కారులో అమ్డాపూర్ వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో కాశీంబౌలి గేటు వద్ద ఉన్న మూలమలుపుపై కారు అతివేగంతో వెళ్లి పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి రోడ్డు కిందికి దూసుకెళ్లారు. దీంతో విద్యుత్ స్తంభం విరిగి కింద పడిపోయింది. కారులో ఉన్నవారికి మాత్రం ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయండి

ఎంపీ మల్లు రవికి నేతల వినతి



ఎంపీ మల్లురవికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: పట్టణంలో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయాలని నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవిని కాంగ్రెస్ ఆమనగల్లు మండల నాయకులు కోరారు. హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్య, మాజీ వైస్ ఎంపీపీ నారాయణ, నాయకుడు శ్రీను మర్యాద పూర్వకంగా ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా నాలుగు మండలాలకు కూడలి అయిన ఆమనగల్లు పట్టణంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు(ఏసీపీ) కార్యాలయం మంజూరు చేయించాలని వినతిపత్రం అందించారు. ప్రస్తుతం ఆమనగల్లు, కడ్తల్‌లో సర్కిల్ కార్యాలయాలు ఉన్నాయని, ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాలను కలుపుకొని ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు ఎంపీ మల్లురవి చొరవ తీసుకోవాలని వారు అభ్యర్థించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



మణికంఠ (ఫైల్)

ఆమనగల్లు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆమనగల్లు పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన సామల మణికంఠ(18) ఆదివారం మృతిచెందినట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 2వ తేదీ రాత్రి పట్టణానికి చెందిన సామల మణికంఠ, శ్రీనివాస్, మణికిరణ్ ద్విచక్ర వాహనంపై విఠాయిపల్లికి వెళుతుండగా వెనుకనుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అందులో మెరుగైన వైద్యం కోసం సామల మణికంఠను అపోలో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై మృతుడి తండ్రి హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

రాష్ట్ర ఆర్‌డీసీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

తుర్కయంజాల్: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు, యువతలో స్నేహ పూర్వక వాతావరణాన్ని నెలకొల్పడానికి దోహదం చేస్తాయని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. ఆదివారం పురపాలక సంఘం పరిధి మునగనూర్‌లో క్రికెట్ ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ఆయన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, గుండ్లపల్లి ధన్‌రాజ్‌గౌడ్, అమరేందర్‌రెడ్డి, మోహన్‌గుప్తా, అంజయ్య, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి..

- యువతిపై లైంగికదాడి
- నిందితుడిపై కేసు నమోదు

సనత్‌నగర్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతిపై లైంగికదాడికి పాల్పడిన యువకుడిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లాకు చెందిన యువతి(34) వెంగళరావునగర్‌లో ఉంటూ బేగంపేటలోని ఓ ఐటీ శిక్షణ సంస్థలో హెచ్‌ఆర్ శిక్షణ తరగతులకు హాజరవుతుంది. అదే సంస్థలో కేవీ సంతోష్ చైతన్య అనే యువకుడు శిక్షణ పొందుతున్నాడు. ఇదిలా ఉండగా వర్షం కురిస్తే సదరు యువతి అద్దెకు ఉంటున్న ఇంట్లో నీరు కారుతుండటంతో శిక్షణ కేంద్రానికి సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని సంతోష్ చైతన్యకు చెప్పడంతో తన తల్లి, చెల్లితో కలిసి ఇల్లు చూసి పెడతానని ఆమెకు హామీ ఇచ్చాడు. దీంతో సదరు యువతి జూన్ 5న ప్రకాష్‌నగర్‌లోని సంతోష్ చైతన్య ఇంటికి వెళ్లగా ఆమెను గదిలోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఐదు రోజుల పాటు ఆమెను తన ఇంట్లోనే ఉంచుకున్నాడు. ఆ తర్వాత పెళ్లి విషయమై ప్రశ్నించగా తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో బాధితురాలు జులై 11న షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేసింది. వారు సంతోష్ చైతన్యను పిలిపించి నిలదీయగా తాను పెళ్లి చేసుకోనని చెప్పడంతో షీ టీమ్ పోలీసులు కేసును బేగంపేట పీఎస్‌కు బదిలీ చేశారు. బేగంపేట పోలీసులు అతడిని పిలిచి మాట్లాడగా బాధితురాలిని పెళ్లి చేసుకుంటానని లిఖిత పూర్వకంగా పేర్కొన్న సంతోష్ చైతన్య ఆ మర్నాటి నుంచి కనిపించకుండా పోయాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

200 మంది నిషాచరులు చిక్కారు!

సైబరాబాద్‌లో స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్

సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్ పోలీసులు మందుబాబుల మత్తు దించుతున్నారు. వీకెండ్స్‌లో స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ (డీడీ)లు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో శనివారం నిర్వహించిన డీడీల్లో 200 మంది నిషాచరులు పోలీసులకు చిక్కారు. వారిలో 153 మంది ద్విచక్ర వాహనదారులు కాగా, 11 మంది త్రీవీలర్లు, 31 మంది ఫోర్ వీలర్లు, ఐదుగురు భారీ వాహనాల డ్రైవర్లు ఉన్నారు. పట్టుబడిన వారిలో 28 మంది మందుబాబుల బ్లడ్ ఆల్కాహాల్ కాన్సన్‌ట్రేషన్ (బీఏసీ) మోతాదు 200 ఎంజీ, 550 నమోదయింది. ఆయా వాహనదారులను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

మూడు కుటుంబాల్లో విషాదం

రోడ్డు ప్రమాదంలో మేడ్చల్‌కు చెందిన మెకానిక్‌ల దుర్మరణం

మేడ్చల్: శ్రీశైలం వెళుతున్న ముగ్గురు మెకానిక్‌లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మూడు కుటుంబాల్లో విషాదం నెలకొంది. మేడ్చల్ మున్సిపాలిటీ, అత్వెల్లిలోని జయరాం ఆటోమోటివ్ (మహేంద్ర ట్రాక్టర్ షోరూం)లో కొంపల్లికి చెందిన సాయిప్రకాష్(24) ,బొల్లారానికి చెందిన కిషన్(22) కోస్గి కి చెందిన రమేష్(21) లు జయరాం మెకానిక్‌లుగా పని చేస్తున్నారు. శనివారం తమ బంధువుల కారు తీసుకుని సికింద్రాబాద్‌లో మరో స్నేహితుడితో కలిసి శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వటువార్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురూ మృతి చెందారు. చేతికి అంది వచ్చిన యువకులు మరణించడంతో మూడు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

ఎయిర్‌పోర్టు కిషన్‌గూడ ర్యాంపు మూసివేత

శంషాబాద్: జాతీయ రహదారి ఆరు లేన్‌ల విస్తరణ పనుల్లో భాగంగా ఎయిర్‌పోర్టు నుంచి కిషన్‌గూడ వైపు ఉన్న ర్యాంపు రహదారిని మూసివేశారు. ఇక్కడ సర్వీసు రోడ్లు, డ్రెయిన్ పనుల కారణంగా మరో 45 రోజుల పాటు ఈ రహదారి వాహనదారులకు అందుబాటులో ఉండదని సైబరాబాద్ పోలీసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బెంగళూరు ప్రవేశం నుంచి వచ్చే వాహనాలు ట్రామాకేర్ వద్ద యూ టర్న్ తీసుకుని హైదరాబాద్ వైపు వెళ్లాల్సి ఉంటుందన్నారు. హైదరాబాద్ వైపు నుంచి వచ్చే దారులు యథాతథంగా ఉంటాయన్నారు.

విజయవంతంగా హైదరాబాద్ మారథాన్ డ్రై రన్

5కే, 10కే, హాఫ్, ఫుల్ మారథాన్ నిర్వహణ

సాక్షి, సిటీబ్యూరో: త్వరలో జరగబోయే ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ డ్రై రన్ విజయవంతంగా ముగిసింది. 5కే, 10కే తో పాటు హాఫ్ మారథాన్, ఫుల్ మారథాన్ మార్గాల్లో రన్నర్లు పరిగెత్తారు. హాఫ్ మారథాన్ నెక్లెస్ రోడ్డులో ఉదయం 5 గంటలకు ప్రారంభమైంది. 10కే రన్ ఉదయం 6.15 గంటలకు హైటెక్స్ క్యాంపస్ వద్ద ప్రారంభమైంది. 5కే రన్ గచ్చిబౌలి స్టేడియం క్యాంపస్ వద్ద ఉదయం 6.15 గంటలకు ప్రారంభమైంది. అందరూ గచ్చిబౌలి స్టేడియం వద్ద తమ రన్‌ను ముగించారు. ఈ నెల 24న హైదరాబాద్ మారథాన్ జరగనుంది. ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్‌కు వరల్డ్ అథ్లెటిక్స్ నుంచి గుర్తింపు వచ్చిన విషయం తెలిసిందే. హైదరాబాద్ ప్రజల సంస్కృతిలో రన్నింగ్‌ను భాగం చేయాలనే ఉద్దేశంతో హైదరాబాద్ రన్నర్స్ అసోసియేషన్ కృషి చేస్తోంది.

కదులుతున్న కారులో మంటలు

సనత్‌నగర్: నడుస్తున్న కారులో నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగలు..క్షణాల్లో మంటలు వ్యాపించాయి. దీంతో కారు నడుపుతున్న వ్యక్తి అప్రమత్తమై భార్యతో సహా కారు దిగి ప్రాణాలు కాపాడుకున్నాడు. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఈసీఐఎల్ సమీపంలోని దమ్మాయిగూడ సాయిప్రియ కాలనీకి చెందిన రవీందర్, అతడి భార్య సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్నారు. శనివారం రాత్రి వీరు నిజాంపేట నుంచి దమ్మాయిగూడ వైపు హోండా సిటీ కారులో వస్తుండగా బేగంపేట పీ అండ్ టీ ఫ్లైఓవర్ పైకి రాగానే కారు ఇంజిన్‌లో నుంచి పొగలు రావడాన్ని గుర్తించి కిందికు దిగారు. రవీందర్ కారు బానెట్ తెరిచి చూసేలోగా మంటలు వ్యాపించాయి. వెంటనే డయల్ 101కు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ప్రాణ నష్టం జరగలేదు. అయితే కారు పాక్షికంగా కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సవాళ్లకు సిద్ధంగా ఉండాలి

ఘనంగా బిట్స్ ఫిలానీ స్నాతకోత్సవం

జవహర్‌నగర్: విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలని బఫెలో యూనివర్సిటీ అధ్యక్షులు, ప్రొఫెసర్ సతీష్ కె.త్రిపాఠి అన్నారు. ఆదివారం జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని బిట్స్ ఫిలానీ క్యాంపస్‌లో స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బఫెలో యూనివర్సిటీ అధ్యక్షులు, ప్రొఫెసర్ సతీష్ కె.త్రిపాఠి న్యూయార్క్, బిట్స్ ఫిలానీ వీసీ ప్రొఫెసర్ రాంగోపాల్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీష్ కె.త్రిపాఠి మాట్లాడుతూ.. విద్యార్థులు ఎన్నో సవాళ్లను ఎదుర్కొని భవిష్యత్తును నిర్దేశించుకోవాలన్నారు. నేటి యువత బలమైన నమ్మకంతో భవిష్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు. టెక్నాలజీతోనే మానవ మనుగడ ముడిపడి ఉందన్నారు. కృషి, పట్టుదలతో ముందుకు సాగితేనే విజయం సాధ్యమన్నారు. ఈ సందర్భంగా డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసి 1600 మంది విద్యార్థులకు పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో బిట్స్ ఫిలానీ డైరెక్టర్ సౌమ్య ముఖర్జీ, అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్

క్రీడా సంబురం

- ఘనంగా 31వ ఆల్ ఇండియా ఆర్పీఎఫ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ప్రారంభం
- హాజరైన రైల్వే ఉన్నతాధికారులు
- 15 జోనల్ రైల్వేల నుంచి 275 మంది క్రీడాకారులు



చాంపియన్‌షిప్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే ఉన్నతాధికారులు



రన్నింగ్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: క్రీడాపోటీలు కేవలం పతకాలు సాధించడానికి మాత్రమే కాకుండా స్నేహాన్ని పెంపొందించడం, జ్ఞాపకాలను సృష్టించుకోవడానికి దోహదపడుతాయని ఎస్‌సీఆర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదనరావు, సికింద్రాబాద్ డీఆర్ఎం భరతేష్ కుమార్ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆల్ ఇండియా ఆర్పీఎఫ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ -2024 ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు పావురాలను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వం అలవడుతుందన్నారు. కఠినమైన శిక్షణ, సవాళ్లను అధిగమించడానికి ఛాంపియన్‌షిప్‌లు దోహదపడుతాయన్నారు. ఈ చాంపియన్‌షిప్‌లో రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్‌తో సహా 15 జోనల్ రైల్వేల నుంచి 275 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. వంద మీటర్ల స్ప్రింట్ నుంచి హై జంప్ వరకు క్రీడాకారులు అసాధారణ నైపుణ్యాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక చాంపియన్‌షిప్ భారతీయ రైల్వే చరిత్రలో ఒక మైలు రాయిగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమీషనర్ (డీఎస్‌సీ) డెబస్మిత సి. బెనర్జీ పాల్గొన్నారు.